

మిరప చేనులో
గంజాయి మొక్కల సాగు
మర్వెల్లిలో పోలీసుల దాడులు.. ఒకరిపై కేసు 7
ఐఐటీహెచ్‌లో ఎన్‌సీసీ కార్యాలయం
ప్రారంభించిన సెంట్రల్ గ్రూప్ కమాండర్



మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లో గోదావరి జలాలను చూసి సంతోషిస్తున్న హరీశ్‌రావు, సునీతారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి

కేసీఆర్ కల నెరవేరింది

- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- భారీ కాన్వాయ్‌తో మల్లన్నసాగర్‌కు బీఆర్‌ఎస్ నేతలు
- రిజర్వాయర్‌లో జలాలను చూసి పులకింత
- గోదారమ్మకు పూలు చల్లి హరీశ్ పూజలు

తొగుట, సెప్టెంబరు 20 : మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లో గోదావరి జల పరవళ్లను చూసి గులాబీ శ్రేణులు పరవశించారు. శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు వెంకట్రామారెడ్డి, యాదవరెడ్డి, దేశపతి శ్రీనివాస్ తదితరులు భారీ కాన్వాయ్‌తో మండలంలోని తుక్కాపూర్ సమీపంలోని మల్లన్నసాగర్ రిజర్వాయర్ వద్దకు చేరుకున్నారు. వారికి పార్టీ నాయకులు పూలు చల్లుతూ ఘన స్వాగతం పలికారు. రిజర్వాయర్ వద్దకు చేరుకోగానే జోరు వర్షం పడటంతో వానలో తడుస్తూ మల్లన్నసాగర్‌లో గోదావరి జలాలను చూసి పులకించారు. కేసీఆర్ కలలు కన్న కాళేశ్వరం ఫలాలు నేటికి నెరవేరాయని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నీటిలో పసుపుకుంకుమ, పూలు చల్లి గోదారమ్మకు పూజలు చేశారు.

ఆనాడు కేసులు.. ఈనాడు డైవర్షన్ పాలిటిక్స్

ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మల్లన్నసాగర్ నేడు నిండుకుండలా కనిపిస్తూ కన్నులపండుగగా ఉందన్నారు. కేసీఆర్ కల నేరవేరిందన్నారు. ఈ నీటితో పండిన పంటలో ప్రతీ గింజపై కేసీఆర్ పేరు ఉంటుందన్నారు. ఆనాడు ప్రాజెక్ట్ నిర్మాణం చేపడుతుంటే అడ్డుకుని కోర్టుల్లో కేసులు వేశారని, నేడు నిండుకుండలా తలపిస్తున్న మల్లన్నసాగర్ సందర్శనకు వస్తే కాంగ్రెస్ నాయకులు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. ఈ జలాలతో మెదక్, యాదాద్రి, సిద్దిపేట జిల్లాలలోని రైతుల పొలాలు



అభివాదం చేస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

పండటం మీకు ఇష్టం లేదా అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌కు గోదావరి జలాలను తీసుకుపోయి మూసీనదిని శుభ్రం చేస్తానంటున్నాడని, తాగునీటిని అందిస్తానంటున్నాడని, ఇది కేసీఆర్ కట్టిన మల్లన్నసాగర్‌తోనే సాధ్యమవుతుందని కాంగ్రెస్ నేతలు గుర్తించుకోవాలని హితవు పలికారు. గతేడాది ఆగస్టులోనే చేపపిల్లలు వేసి మత్స్యకారులకు ఉపాధి కల్పించామన్నారు. కానీ ఈ ఏడాది సెప్టెంబరు గడుస్తున్నప్పటికీ ఇంతవరకు చేపపిల్లల పంపిణీ చేయకపోవడం దారుణమన్నారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోలేదని, రేవంత్‌రెడ్డి నోరు కుళ్లిపోయిందన్నారు. మల్లన్నసాగర్‌కు వచ్చి కాళేశ్వర జలాలతో పుకిలించుకుంటే ఆయన నోరు శుభ్రమవుతుందని హితవు పలికారు. బీఆర్‌ఎస్ నేతల పర్యటన నేపథ్యంలో పోలీసులు భారీగా మోహరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంటేరు ప్రతాప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి, నాయకులు మల్లారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రమేశ్, అరుణ్‌కుమార్, కనకయ్య, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

భోజనానికీ కష్టమే...

సంక్షేమ హాస్టళ్ల నిర్వహణకు పైసల్లేవ్!

- ఎనిమిది నెలలుగా పేరుకుపోయిన బకాయిలు
- రూ.కోట్లల్లో మెస్, లక్షల్లో కాస్మొటిక్ చార్జీలు పెండింగ్
- అప్పు చేసి సరుకులు కొనుగోలు చేస్తున్న వార్డెన్లు
- తలకుమించిన భారంగా వసతిగృహాల నిర్వహణ
- పట్టించుకోని ప్రభుత్వం, ఉన్నతాధికారులు



సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 20 : సంక్షేమ హాస్టళ్లలో మెస్, కాస్మొటిక్ బకాయిలు రూ. కోట్లలో పేరుకుపోయాయి. ఎనిమిది నెలలుగా నిధులు విడుదల చేయడం లేదు. ఇన్నాళ్లు అప్పులు చేసి విద్యార్థులకు భోజనం పెట్టిన హాస్టళ్ల వార్డెన్లు చేతులెత్తేసే పరిస్థితి వచ్చింది. నిధులు లేకపోవడంతో ఏంచేయాలో తోచక హాస్టళ్ల వార్డెన్లు తలలు పట్టుకుంటున్నారు. వ్యాపారుల సరుకులు అప్పు తెచ్చి హాస్టళ్ల నిర్వహణ కొనసాగిస్తున్నారు. ఆరు నుంచి ఎనిమిది నెలలుగా బకాయిలు ఉండడంతో వ్యాపారులు డబ్బుల కోసం ఒత్తిడి తెస్తున్నారని పలువురు వార్డెన్లు పేర్కొంటున్నారు. సర్కారు నుంచి సకాలంలో నిధులు రాకపోవడం కారణంగా హాస్టళ్లను తనిఖీలు చేసి మెనూ ప్రకారం ఏం పెడ్ ఇస్తున్నారో కూడా సంక్షేమశాఖల జిల్లా అధికారులు మిన్నకుండి పోతున్నారనే విమర్శలున్నాయి.

ధరలు పెరిగినా..

సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు ప్రభుత్వం 2017లో నిర్ణయించిన ప్రకారమే మెస్‌చార్జీలను చెల్లిస్తున్నది. 3 నుంచి 7వ తరగతి వరకు చదివే విద్యార్థులకు ఒక్కొక్కరికి నెలకు రూ.950 చొప్పున చెల్లిస్తున్నది. 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు నెలకు రూ.1,100, ఇంటర్మీడియట్ నుంచి డిగ్రీ వరకు ఒక్కో విద్యార్థికి నెలకు రూ.1,500 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తున్నది. ఇందులోనే వంటగ్యాస్, ఉదయం బ్రేక్‌ఫాస్ట్, గుడ్లు, పాలు, రాత్రి భోజనం, వారానికి రెండుసార్లు చికెన్ పెట్టాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. కాస్మొటిక్‌చార్జీల కింద ప్రతీ నెల బాలురకు రూ.62, బాలికలకు రూ.75 చెల్లిస్తారు. మార్కెట్‌లో సరుకుల ధరలు అమాంతం పెరిగిపోయిన నేపథ్యంలో ఈ నిధులు సరిపోవడం లేదని వార్డెన్లు వాపోతున్నారు. అవి కూడా ప్రతీనెల విడుదల చేయకుండా నెలల తరబడి ఆలస్యం చేయడంతో అష్టకష్టాలు పడాల్సి వస్తున్నదని వసతి గృహాల సంక్షేమాధికారులు వాపోతున్నారు. ఇక ఆయా సంక్షేమ హాస్టళ్లలో ఔట్‌సోర్సింగ్ కింద పనిచేసే కుక్, కామటి, వాచ్‌మెన్లకు ఆరు నెలల నుంచి వేతనాలు కూడా చెల్లించడం లేదని వాపోతున్నారు.

సంక్షేమ హాస్టళ్లు	విద్యార్థుల సంఖ్య	పెండింగ్ బిల్లులు	డైట్ చార్జీల బకాయిలు	కాస్మొటిక్ చార్జీల బకాయిలు
బీసీ (35)	3046	7 నెలలు	రూ.1,78,37,600	రూ.4,37,800 (జూన్ నుంచి)
ఎస్సీ (47)	5200	6 నెలలు	రూ.3.5 కోట్లు	
ఎస్టీ (13)	1800	8 నెలలు	రూ.1.20 కోట్లు	



డిపో సరే.. డ్రైవర్లు ఏరి?

- 45 మంది ఉండాల్సిన చోట 35 మందితో సరి
- నర్సాపూర్ డిపోలో పూర్తిస్థాయిలో నడవని బస్సులు
- బస్సుల కోసం సాలక్‌పల్లివాసుల ధర్నా

7లో



పోషణ్ అభియాన్ కార్యక్రమంలో శిశువును లాలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

గర్భిణులు, మాతాశిశువుల

సంక్షేమానికే పోషణ్ అభియాన్

సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 20 : తల్లీ, బిడ్డల సంక్షేమానికే పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో శుక్రవారం మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ పోషణ్ అభియాన్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలోని 1,504 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ నెల 1 నుంచి 30 వరకు పోషణ్ అభియాన్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సిబ్బంది ప్రతీ ఇంటికి వెళ్లి పోషకాహారం, పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతీరోజు గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పాలు, గుడ్లు, పోషక విలువలు కలిగిన ఆహారాన్ని ఇవ్వాలన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించేలా చూడాలని, ముర్రుపాలే బిడ్డకు శ్రేయస్కరమని చెప్పారు. పోషణ లోపం కలిగిన పిల్లలను గుర్తించి ఆరోగ్యవంతులుగా మార్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రక్తహీనత లేకుండా గర్భిణులు పాలు, రాగులు, జొన్నలు, చిరుధాన్యాలు, ఆకుకూరలు లాంటివి తీసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ, వైద్యశాఖ సిబ్బందితో పోషణ అభియాన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఎంఅండ్‌హెచ్‌వో డా.గాయత్రీదేవి, డీఈవో వెంకటేశ్వర్లు, ఆయా శాఖల జిల్లా అధికారులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

వరుస చోరీల దొంగ అరెస్టు

- రూ. 2 లక్షల నగదు, బంగారు అభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్



వివరాలు వెల్లడిస్తున్న మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్

మెదక్ అర్బన్, సెప్టెంబరు 20: వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం పట్టణ పోలీసు స్టేషన్ ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ నాగరాజుతో కలిసి మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ వివరాలు వెల్లడించారు. హావేళీఘణపూర్ మండల పరిధిలోని తొగిట గ్రామానికి చెందిన మాచబోయిన మహేష్ కుమార్ గత మూడు నెలల నుంచి పట్టణంలోని ఫతేనగర్, జంబికుంట, దాయర కాలనీల్లో దొంగతానాలకు పాల్పడుతున్నాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసిన అతని వద్ద నుంచి రూ. 2 లక్షల నగదు, 17.5 గ్రాములు బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించడంలో కీలకపాత్ర పోషించిన ఐడీ పార్టీ కానిస్టేబుల్ దుర్గారెడ్డి, నర్సింహులు, ప్రశాంత్‌ను డీఎస్పీ అభినందించారు.

కేజీబీవీల్లో నియామకాలు

మెదక్ జిల్లాలో 32 మందికి పోస్టింగ్.. నేటి నుంచి విధుల్లోకి



మెదక్‌లో కస్తుర్బాగాంధీ బాలికల విద్యాలయం

మెదక్ అర్బన్, సెప్టెంబరు 20: కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలకు కొత్త గురువులు వచ్చారు. శుక్రవారం డీఈవో కార్యాలయంలో జిల్లావ్యాప్తంగా 32 మందికి నియామకపత్రాలు అందజేశారు. ఇటీవల జరిగిన బదిలీలతోపాటు గురుకులాల్లో ఉద్యోగాలు వచ్చి కొందరు, ఇతర ఉద్యోగాలకు ఎంపికైన కారణంగా మరికొందరు కేజీబీవీ ఉద్యోగాలను వదిలిపెట్టారు. దీంతో జిల్లాలోని కేజీబీవీల్లో 54 ఖాళీలు ఏర్పడ్డాయి. కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

23 పోస్టులు బ్యాక్‌లాగ్

గతేడాది నిర్వహించిన రాత పరీక్షకు సంబంధించిన మెరిట్ జాబితా ఆధారంగా ఖాళీలను భర్తీ చేశారు. కలెక్టర్ ఆదేశాలమేరకు ఒక్కో పోస్టుకు ముగ్గురి చొప్పున ఎంపిక చేసి, ధ్రువపత్రాల పరిశీలనకు పిలిచారు. ధ్రువపత్రాల పరిశీలన అనంతరం మెరిట్, రోస్టర్ ప్రకారం అర్హులైన వారిని ఎంపిక చేశారు. జిల్లావ్యాప్తంగా 19 కస్తుర్బాగాంధీ బాలికల విద్యాయాలు ఉండగా.. అందులో మొత్తం 55 ఖాళీ పోస్టులకు గానూ 32 మందికి కొత్తగా నియామక పత్రాలు అందజేశారు. సీఆర్టీ, పీజీసీఆర్టీ, పీఈటీ, స్పెషల్ ఆఫీసర్, నర్సింగ్ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేశారు. ఇంకా 23 పోస్టులు మెరిట్, రోస్టర్ ప్రకారం అభ్యర్థులు లేనందున బ్యాక్‌లాగ్ కింద మిగిలిపోయినట్లు డీఈవో రాధాకిషన్ తెలిపారు.



నిమజ్జనం ముగిసే..

ప్రతిమలు మిగిలే!!

మండపాల్లో 11 రోజుల పాటు విశేష పూజలందుకున్న గణనాథుడి నిమజ్జనం కూడా ఘనంగానే నిర్వహించాం. కానీ, ప్రతిమలు పూర్తిగా మునగకుండానే వదిలివేశారు. సంగారెడ్డి పట్టణ శివారులోని మహబూబ్‌సాగర్ చెరువులో నిమజ్జనం చేసిన వినాయక విగ్రహాలు నీటిపై ఇలా తేలియాడుతున్నాయి.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

రూ. 200 కోట్ల పనులు

ప్రారంభంకాలే...

నిలిచిన నిధులు.. వెక్కిరిస్తున్న శిలాఫలకాలు

- స్థలం కేటాయించినా పట్టాలెక్కని వైద్య కళాశాల భవనాల నిర్మాణం
- స్థలం దొరక్క ముందుకుసాగని పట్టణ ఆరోగ్య కేంద్రం
- శకుస్థాపనలతోనే సరిపెట్టిన కుల సంఘాల భవనాలు
- మెదక్ జిల్లా కేంద్రంలో అటకెక్కిన అభివృద్ధి పనులు

7



ధరణి పెండింగ్ దరఖాస్తుల

సత్వర పరిష్కారం

- మెదక్ జిల్లావ్యాప్తంగా 10 వేల ఆర్జీలకు మోక్షం
- వెల్లడించిన కలెక్టర్ రాహుల్‌రాజ్



కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, సెప్టెంబరు 20: తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు ధరణి ఆర్జీలను స్పెషల్ డ్రైవ్ పద్ధతిలో జిల్లా రెవెన్యూ యంత్రాంగం పరిష్కరిస్తున్నదని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. జూలై నాటికి 10,400 దరఖాస్తులు పెండింగ్ ఉండగా.. జూలై, ఆగస్టు, సెప్టెంబర్‌లో 3,600 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. మొత్తం 14 వేల అర్జీలకు శుక్రవారం వరకు 10 వేల దరఖాస్తులను పరిష్కరించామని తెలిపారు. మిగిలిన దరఖాస్తులను అతి త్వరలో పరిష్కరిస్తామన్నారు. వచ్చే సోమవారం నుంచి అన్ని తహసీల్దార్, రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయాల్లో ప్రజావాణి నిర్వహించునున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొత్తగా మూడు పీహెచ్‌సీలు

- సంగారెడ్డి జిల్లాలో రెండు, మెదక్ జిల్లాలో ఒకటి
- అనుమతులు జారీచేసిన హెల్త్‌సెక్రటరీ

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 20 : సంగారెడ్డి జిల్లాలో రెండు, మెదక్ జిల్లాలో ఒక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులిచ్చింది. ఈమేరకు పరిపాలనా అనుమతులు ఇస్తూ హెల్త్‌సెక్రటరీ క్రిస్టినా జడ్ చోంగ్తు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సంగారెడ్డి జిల్లాలోని మునిపల్లి మండలం కంకోల్, రాయికోడ్ మండలం సింగీతం, మెదక్ జిల్లాలోని టేక్మాల్ మండలం ఎల్లుపేట్ గ్రామంలో నూతన పీహెచ్‌సీలు ఏర్పాటుకానున్నాయి. ఒక్కో పీహెచ్‌సీకి రూ. 2 కోట్ల 45 లక్షల చొప్పున రూ.7 కోట్ల 35 లక్షల నిధులు కేటాయించగా, నిర్మాణ పనులను టీజీఎంఎస్‌ఐడీసీ చేపట్టనున్నది. పీహెచ్‌సీల నిర్మాణాలకు త్వరలోనే టెండర్లు పిలవనున్నట్టు అధికారులు తెలిపారు. పీహెచ్‌సీల మంజూరుతో ఆయా గ్రామల ప్రజలకు వైద్యసేవలు చేరువకానున్నాయి.

బంగారం కోసం
మహిళ హత్య
దంపతులకు రిమాండ్
రెండు బైకులు ఢీకొని
ఆరుగురికి గాయాలు
కుటుంబ కలహాలతో వివాహిత..
మద్యానికి బానిసై వ్యక్తి..
ఆత్మహత్య
వార్తలు 7వ పేజీలో

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి


దుర్గమ్మ (ఫైల్)

కౌడిపల్లి,కొల్చారం సెప్టెంబరు 20 : గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిల మృతి చెందిన సంఘటన కొల్చారం మండలంలోని పోతంశెట్టిపల్లి చౌరస్తాలో శుక్ర వారం జరిగింది. పోలిసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని వడ్డెర కాలనికి చెందిన ముద్దం గుల దుర్గమ్మ (55) అనారోగ్యంతో బాధపడుతున్నది. దీంతో ఆమె మెదక్ అసుపత్రికి వెళ్లి తిరిగి వస్తుండగా బస్సు దిగి నడుచుకుంటూ వెళ్తూ రోడ్డును దాటు తుంది. అప్పుడే ఓ గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి ఢీ కొనడంతో దుర్గమ్మ అక్కడిక్కడే మృతి చెందింది. మృతురాలికి ఐదు గురు కూతురులు, కూమారుడు ఉన్నారు. మృతురాలి భర్త మల్లయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమొదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు నీట మునిగి మత్స్యకారుడి మృతి


కేశయ్య మృతదేహం

పాపన్నపేట, సెప్టెంబరు 20 : చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవ శాత్తూ ఓ మత్స్యకారుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని మిన్పూర్ గ్రామంలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన నాయికోటి కేశయ్య (58) మత్స్యకారుడిగా జీవనం సాగిస్తు న్నాడు. శుక్రవారం చేపలు పట్టడానికి చెరువు వద్దకు వెళ్లాడు. చేపలు పట్టే క్రమంలో ప్రమాదవశాత్తు నీట ముని గిపోయాడు. అక్కడే ఉన్న స్తానికులు గమనించి గ్రామస్థులు, , పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలా నికి చేరుకున్న వారు స్థానికుల సాయంతో చెరువులో గాలింపు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.మృతుడి కుమారుడు భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పత్తి పంటకు పురుగుల బెడద

● నివారణ చర్యలు చేపట్టాలంటున్న అధికారులు


రైతులకు సూచనలు చేస్తున్న మండల వ్యవసాయ అధికారి వసంతరావు

జగదేవ్‌పూర్, సెప్టెంబరు 20: పది రోజుల క్రితం కురి సిన అధిక వర్షాలు, ప్రస్తుతం ఉన్న అధిక ఉష్ణోగ్రతల వలన పత్తి పంటకు పురుగుల బెడద నెలకొన్నది. రసం పీల్చే, లైన పచ్చదోమ, తామర పురుగుల తోపాటు పిండి నల్లి, కాయ కుళ్లు తెగులు అధికంగా వచ్చే ప్రమాదం ఉన్నదని, రైతులు వెంటనే నివారణ చర్యలు చేప ట్టాలని వ్యవసాయ అధికా రులు సూచిస్తున్నారు.

వ్యవసాయ అధికారుల సూచనలివే..

ఎకరానికి లీటర్ వేప నూనె(1500పీపీఎం) గానీ, ఇమిడ క్లోప్రిడ్ 60 మిల్లీ లీటర్లు గానీ అసిట మాప్రైడ్ 100 గ్రాములు లేదా అసిఫేట్ 300 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పది రోజుల వ్యవధిలో రెండుసార్లు పై మందులు మార్చి పిచికారి చేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. కాయ కుళ్లు తెగులు నివారణకు 1 గ్రాము ప్లాంటమైసిన్, 30 గ్రాముల కాపర్ ఆక్సిక్లో రైడ్‌ను 10 లీటర్ల నీళ్లలో కలిపి మొక్కల కాయలపై పిచికారి చేయాలంటు న్నారు. గులాబీ రంగు పురుగు నివారణకు లింగాకర్షణ బుట్టలను ఎకరానికి 5 నుంచి 6 పెట్టుకొని వరుసగా రెండు రోజుల్లో ఏడు ఎనిమిది మగ పురు గులు పడినట్లయితే ఎకరానికి 1 లీటర్ వేప నూనెను గాని లేదా 100గ్రాముల థయోమిథాక్సంను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయా లని సూచిస్తున్నారు.

పత్తి పంట పరిశీలన..

పత్తి పంటలో పురుగు సోకుతున్న పంటలను మండల వ్యవసాయ అధికా రులు క్షేత్ర స్థాయిలో వెళ్లి పరిశీలిస్తున్నారు. శుక్రవారం జగదేవ్‌పూర్ మండ లంలోని ఇటిక్యాల, ఆలిరాజుపేట గ్రామాలలోని పత్తి పొలాలను మండల వ్యవసాయ అధికారి వసంతరావు సందర్శించారు. అధికారుల సలహాలు సూచనల మేరకు మందులు పిచికారి చేయాలని ఈ సందర్భంగా ఆయన రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈవో శరణ్య, రైతులు కిష్టయ్య, బాల స్వామి, శౌరీ తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీహెచ్‌కు ఏఎన్ఆర్ అవార్డు

● ప్రకటించిన అక్కినేని ఇంటర్నేషనల్ ఫౌండేషన్

కంది, సెప్టెంబరు 20 : యాక్టింగ్ అండ్ పెర్మామెన్స్‌లో ప్రతిభ కనబర్చిన సంగారెడ్డి జిల్లా కందిపరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌లోని లిబర్ ఆర్ట్స్ విభాగా నికి అక్కినేని ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శుక్రవారం నాడు ఏఎ న్ఆర్ అవార్డును ప్రకటించారు. అక్కినేని నాగేశ్వరావు కుటుంబం ద్వారా స్థాపించిన యాక్టింగ్ అండ్ పెర్మామెన్స్ ఆర్ట్స్ కోసం ఏఎన్ఆర్ అవార్డును ఏర్పాటు చేశారు. అక్కినేని నాగేశ్వరరావు వారసత్వాన్ని పురస్కరించుకుని ఏఎ న్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు కళా రంగంలో అసాధారణ ప్రతిభ కనబర్చిన వారిని గుర్తించి వారికి ఈ అవార్డు ఇస్తారు. అయితే, ఐఐటీ హైదరాబాద్‌కు ఈ గౌరవాన్ని అందించినందుకు గర్వకారణంగా ఉందని, అక్కినేని ఇంటర్నేష నల్ ఫౌండేషన్ ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి కృతజ్ఞతలు తెలిపారు.

గంజాయి సాగుపై దాడులు

● మర్వెల్లిలో సాగు.. ఒకరిపై కేసు



ధ్వంసం చేసిన గంజాయి మొక్కలను చూపిస్తున్న పోలీసులు

వట్‌పల్లి, సెప్టెంబరు 20 : మండలంలోని మర్వెల్లిలో సాగు చేస్తున్న గంజాయి పంటను పోలీసులు శుక్రవారం ధ్వంసం చేశారు. అసిస్టెంట్ కమిషనర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ మెదక్ డివిజన్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన జుట్టు చిన్న నర్సింహులు తన వ్యవసాయ పొలంలో అంతర పంటగా గంజాయి సాగు చేస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించి రూ.2లక్షలు విలువచేసే 20 గంజాయి మొక్కలను ధ్వంసం చేశారు. నిందితుడు చిన్న నర్సింహులుపై కేసు నమోదు చేసి జోగిపేటలోని ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. ఈ దాడిలో సీఐ పి.వీణారెడ్డి, ఎస్.ఐ అనీల్‌కుమార్, సిబ్బంది విఠల్, అనీల్‌కుమార్, మల్కయ్య, ప్రహ్లాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంటితాళం పగులగొట్టి చోరీ

● బంగారం, వెండి ఆభరణాల అపహరణ

చిన్నకోడూరు, సెప్టెంబరు 20 : తాళం పగులగొట్టి చోరీకి పాల్పడిన ఘటన చిన్నకోడూరు మండలం రామునిపట్ల గ్రామంలో జరిగింది. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దమ్మ యాదవరెడ్డి భార్య పుష్పలత కొన్నిరోజుల క్రితం మృతి చెందింది. పంతులు సూచన మేరకు ఇంటిని వదిలి పెట్టి సిద్దిపేట పట్టణంలో నివాసముంటున్నారు. నిత్యం గ్రామానికి వచ్చి వ్యవసాయ పనులు చూసుకుని వెళ్తుంటారు. శుక్రవారం యాదవరెడ్డి కుమారుడు రాజశేఖర్‌రెడ్డి రామునిపట్లలోని తమ ఇంటి ఎదుట కారు పెట్టి వెళ్దామని రాగా.. మెయిన్ డోర్ గొళ్లెం తీసి కనిపించింది. అనుమానం ఇంట్లోకి వెళ్లి చూడగా కప్‌బోర్డులో ఉన్న 2.5 తులాల బంగారు ఆభరణాలు, 16 తులాల వెండి గొలుసులతో పాటు, రూ.520 కనిపించలేదు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. యాదవరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గంట్లమల్యాలలో రూ.70 వేల నగదు తస్కరణ..



చోరీ వివరాలు సేకరిస్తున్న రాజగోపాల్ పేట పోలీసులు

నంగునూరు, సెప్టెంబరు 20 : వేసిన తాళం వేసినట్లే ఉండగా, తలుపనకు ఉన్న బేడాన్ని రాడుతో వంచి ఇంట్లో చోరీకి పాల్పడిన ఘటన నంగునూరు మండలం గట్లమల్యాలలో చోటు చేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సామల సుధాకర్ అనారోగ్య రీత్యా పుట్టింట్లో ఉన్న భార్యను చూసేందుకు అత్తగారింటికి గురువారం సాయంత్రం ఇంటికి తాళం వేసి వెళ్లాడు. శుక్రవారం ఉదయం సుధాకర్ ఇంటికి తిరిగి వచ్చేసరికి తలుపు బేడాన్ని రాడుతో వంచినట్లు గమనించాడు. ఇంట్లోకి వెళ్లి చూడగా దాచి ఉంచిన రూ.70 వేల నగదు కనిపించలేదు. రాజగోపాల్ పేట పోలీసులకు సమాచారం అందించగా వారు క్యూస్ టీంతో కలిసి అక్కడికి చేరుకుని ఆధారాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

తూప్రాన్, సెప్టెంబరు20: కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వెల్దుర్తి మండలం రామాయిపల్లికి చెందిన సుప్రజ(22)కు తూప్రాన్ పట్టణానికి చెందిన మామిండ్ల శ్రీకాంత్ (30)తో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఏడాది వయసు గల కూతురు సంతానం. కొన్నిరోజులుగా కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన సుప్రజ శుక్రవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మద్యానికి బానిసైన వ్యక్తి ..

మునిపల్లి, సెప్టెంబరు 20 : మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మునిపల్లి ఎస్ఐ రాజేష్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గార్లపల్లికి చెందిన మన్నె మొగులయ్య(36) మద్యానికి బానిసగా మారాడు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం గ్రామంలోని తన పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి తన భార్య ప్రమీలకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సంఘటన స్థలానికి వెళ్లి అతడిని సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పరిశ్రమ వద్ద డీసీఎం క్లీనర్ మృతి



20టీఆర్ఎన్ 80: పరిశ్రమ గేటు వద్ద మృతిచెందిన రాంబాబు

మనోహరాబాద్, సెప్టెంబరు 20 : పరిశ్రమ గేటు వద్ద వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్ర రాష్ట్రం విజయనగరం జిల్లా రాజాం మండలంలోని ఐలపేట గ్రామానికి చెందిన రాంబాబు(43) డీసీఎంపై క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. డ్రైవర్‌తో కలసి విజయనగరం నుంచి మనోహరాబాద్ మండలం రంగాయపల్లి గ్రామంలోని ఎంఎస్ అగర్వాల్ పరిశ్రమకు స్క్రాప్ లోడ్‌తో గురువారం సాయంత్రం వచ్చారు. పరిశ్రమ వద్దకు రాగానే డ్రైవర్ లోడింగ్ కోసం పరిశ్రమ లోపలికి వెళ్లాడు. క్లీనర్ పరిశ్రమ వద్ద బయటే ఉండగా.. శుక్రవారం ఉదయం చూసేసరికి మృతిచెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కుటుంబీకులకు సమాచారం అందించారు. ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

చర్లపల్లి జైలు సూపరింటెండెంట్‌గా రామచంద్రం

● సంగారెడ్డి సెంట్రల్ జైలుకు సంతోష్ కుమార్ బదిలీ

హైదరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : చర్లపల్లి కేంద్ర కారాగారం సూపరింటెండెంట్‌గా జి. రామచంద్రం నియమితులయ్యారు. చర్లపల్లి సూపరింటెండెంట్‌గా ఉన్న సంతోష్‌కుమార్ రాయ్ ప్రస్తుతం పోస్టు ఖాళీగా ఉన్న సంగారెడ్డి సెంట్రల్ జైలుకు బదిలీ అయ్యారు. ఈమేరకు హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ సూపరింటెండెంట్‌గా ఉన్న జి. రామచంద్రం ఇటీవలే ఎస్పీగా పదోన్నతి పొందారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై పిడుగు.. చెలరేగిన మంటలు



చిన్నశంకరంపేట, సెప్టెంబరు 20: చిన్నశంకరంపేట మండలంలోని అంబాజీపేట గ్రామంలో శుక్రవారం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈక్రమంలో గ్రామ నడి ఒడ్డున గ్రామ పంచాయతీ సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై పిడుగు పడడంతో ట్రాన్స్‌ఫార్మర్ పేలీ భారీ శబ్దం వచ్చింది. ఒక్కసారిగా మంటల చెలరేగి చుట్టూ మంటలు వ్యాపించాయి. దీంతో వెంటనే అప్రమత్తమైన గ్రామస్తులు మంటలను చల్లార్చారు. ట్రాన్స్‌ఫార్మర్ పేలడం వల్ల గ్రామంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

విద్యుదాఘాతంతో పంచాయతీ కార్మికుడి మృతి

జోగిపేట, సెప్టెంబరు20: విధి నిర్వహణలో ఉన్న ఓ పంచాయతీ కార్మికుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఘటన మండలంలోని తాలెల్మలో చోటు చేసుకున్నది. ఎస్ఐ పాండు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాలెల్మ గ్రామపంచాయతీ కార్మికుడు మన్నె లక్ష్మయ్య (45)... శుక్రవారం వీధిదీపాలు మరమ్మతు చేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్ కు గురై మృతి చెందాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పాండు పేర్కొన్నారు.

రూ.200 కోట్ల పనులు ప్రారంభంకాలే..

నిలిచిన నిధులు.. వెక్కిరిస్తున్న శిలాఫలకాలు



పిల్లికొట్టాల్ శివారులో ఒకే చోట రూ.260 కోట్ల పనులకు శంకుస్థాపన చేసిన శిలాఫలకాలు

- నిధులున్నా, స్థలమున్నా కాగితాలకే పరిమితమైన వైద్యకళాశాల పనులు
- స్థలం దొరక్క ముందుకుసాగని పట్టణ ఆరోగ్య కేంద్రం..
- పాలకులు స్పందించి పనులు షురూ చేయాలంటున్న పట్టణవాసులు

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబరు 20: దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించలేదన్న చందంగా మారింది జిల్లా కేంద్రం పరిస్థితి. ఓవైపు కొన్ని పనులు మంజూరై రద్దుచేయగా.. మరోవైపు కొన్ని పనులకు నిధులున్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో అభివృద్ధి ఫలాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలకు ముందు అప్పటి మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీ‌ష్‌రావు చేతుల మీదుగా ఎనిమిది పనులకు రూ.260 కోట్లతో హడావిడిగా శంకుస్థాపనలు చేశారు. ఇందులో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.50 కోట్లను పట్టణంలోని 32 వార్డులలో వివిధ పనులు చేపట్టడానికి కేటాయించారు. అదేవిధంగా కురుమసంఘ భవనానికి రూ.2 కోట్లు, ఆర్యవైశ్య గౌడసంఘం భవనాలకు రూ.కోటి, మున్సిపల్ వార్డుల అభివృద్ధికి టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.20 కోట్లు, ప్రభుత్వ వైద్యకళాశాల నిర్మాణానికి రూ.180 కోట్లు, పట్టణ ఆరోగ్య కేంద్రానికి రూ.1.43 కోట్లు, దాయర రోడ్డు విస్తరణకు 7.80 కోట్లు కేటాయిరచగా.. అక్టోబర్ 5న శిలాఫలకాలు వేశారు.

నిధులున్నా ప్రారంభం కాని పనులు..

వైద్యకళాశాల ఏర్పాటుకు పిల్లికొట్టాల్ శివారులో 14 ఎకరాల స్థలాన్ని రెవెన్యూ అధికారులు కేటాయించారు. నిధులు కూడా కేటాయించినా అవి కాగితాలకు పరిమితమయ్యాయనే విమర్శలున్నాయి. భవన నిర్మాణ పనులు ఆర్అండ్‌బీ శాఖకు, పరికరాల కొనుగోలు తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ (టీఎస్ఎంఎస్ఐడీ) శాఖలకు కేటాయించారు. దాదాపు సంవత్సరం కావొస్తున్నా పనులు ప్రారంభమైన దాఖలాలు కనిపించడం లేదు. ఈ విషయమై సంబంధిత అధికారులతో మాట్లాడగా అంచనాలు సిద్ధం చేస్తున్నట్లుగా సమాధానమిచ్చారు. రూ.1.80 కోట్ల పనులకు స్టేట్‌లెవల్‌లో టెండర్ పిలవాల్సి ఉంటుందని.. మావద్ద నుంచి సమాచారం సైతం తీసుకున్నట్లు ఆర్అండ్‌బీ ఈఈ తెలిపారు. పై అధికారుల నుంచి ఎటువంటి ఆదేశాలు వచ్చినా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నట్లు వివరించారు. మరో శాఖ అధికారిని సంప్రదించగా భవన నిర్మాణం పూర్తైతేనే పరికరాలు కొనుగోలుకు టెండర్లు పిలవడం జరుగుతుందని చెప్పుకొచ్చారు. రూ.7.80 కోట్లు కేటాయించిన దాయర రోడ్డు విస్తరణ పనులు మాత్రం ప్రారంభమై ఆగుతూ.. సాగుతూ అన్నచందంగా కొనసాగుతున్నాయి. అక్కడక్కడా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తిచేసి ఎక్కడికక్కడే పనులు నిలిపివేశారని స్థానికులు మండిపడుతున్నారు.

టెండర్ పూర్తి.. కేటాయించని స్థలం..

పట్టణ ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘం ద్వారా రూ. 1.43 కోట్ల కేటాయించినా ఈ పనులు కూడా ముందడగు పడటంలేదు. సంబంధిత టీఎస్ఎంఐడీ శాఖ అధికారులు టెండర్లు సైతం పిలిచారు. కానీ అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని.. అన్నట్లుగా ఇక్కడి పరిస్థితి నెలకొంది. సదరు కాంట్రాక్టర్ పనులు ప్రారంభించాలంటే ఇప్పటికీ స్థలం చూపకపోవడంతో పనులు ప్రారంభానికి నోచుకోలేదు. స్థానిక ప్రజాప్రతినిధులు దృష్టిసారిస్తే తప్ప ఈ భవనం పనులు కూడా ముందడుగుపడే అవకాశం కనిపించడం లేదు.



నిలిచిపోయియిన దాయర రోడ్డు విస్తరణ పనులు

ఎస్‌డీఎఫ్ నిధులు రద్దు చేసిన ప్రభుత్వం..

పట్టణ అభివృద్ధిలో భాగంగా ఎస్‌డీఎఫ్ నిధులు రూ.50 కోట్లు, సంఘ భవనాలకు రూ. 3 కోట్లు కేటాయించగా ప్రభుత్వం రద్దు చేసింది. అసెంబ్లీ ఎన్నికల అనంతరం పరిస్థితులు మారిపోవడం.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత ప్రభుత్వం హయాంలో హడావిడిగా మంజూరి ఇచ్చిన ఎస్‌డీఎఫ్ నిధులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ పనులకు సైతం తిరిగి నిధులు కేటాయించాలని స్థానిక కౌన్సిలర్లు కోరుతున్నారు. మరోవైపు సంవత్సర కాలంగా పట్టణ ప్రగతి నిధులు సైతం నిలిచిపోయాయని.. ఈ క్రమంలో మున్సిపల్ వార్డుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఐఐటీహెచ్‌లో ఎన్‌సీసీ కార్యాలయం

● ప్రారంభించిన సెంట్రల్ గ్రూప్ కమాండర్



ఐఐటీహెచ్ విద్యార్థులతో సెంట్రల్ గ్రూప్ కమాండర్ కల్నల్ సునీల్ అబ్రహం

కంది, సెప్టెంబరు 20 : సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌ను శుక్రవారం సెంట్రల్ గ్రూప్ కమాండర్ కల్నల్ సునీల్ అబ్రహం సందర్శించారు. ఈ సందర్భంగా ఐఐటీహెచ్‌లోని ఎన్‌సీసీ క్యాడెట్లు గార్డ్ ఆఫ్ హానర్ ఇచ్చారు. అనంతరం ఆయన ఐఐటీహెచ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో తెలంగాణ 33వ బెటాలియన్ ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కల్నల్ రమేశ్ సారియల్, ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తితో కలిసి ఎన్‌సీసీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కల్నల్ సునీల్ అబ్రహం ఐఐటీహెచ్ ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. ఎన్‌సీసీ క్యాడెట్లు దేశ భద్రత, క్రమ శిక్షణ కలిగినవారని కొనియాడారు. ప్రస్తుత సమాజంలో ఎన్‌సీసీ క్యాడెట్ల సేవలు ఎంతో అవసరమని, విపత్తులు, ప్రమాదాలు జరిగినప్పుడు ఎన్‌సీసీ క్యాడెట్లు బాధ్యతతో తగిన సహాయం చేస్తారని పేర్కొన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్లు ధర్మబద్ధంగా, నిజాయితీగా ఉంటూ దేశానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్లు అపూర్వమైన అభిరుచితో సానుకూల సమాజ సేవ చేయాలని ఐఐటీహెచ్ డైరెక్టర్ ఆకాంక్షించారు.



బద్దిపోచమ్మ గుడి చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు

బద్ది పోచమ్మ గుడికి ఆదరణ కరువు

● పునర్‌నిర్మించాలని కోరుతున్న భక్తులు

రాయపోల్, సెప్టెంబరు 20: మండలంలోని అనాజీపూర్‌లో ఉన్న పురాతన బద్దిపోచమ్మ గుడి ఆదరణకు నోచుకోక శిథిలావస్థకు చేరుతున్నది. సాధారణంగా గ్రామాల్లో పోచమ్మ, ఎల్లమ్మ, దుర్గమ్మ, మైసమ్మ తదితర ఆలయాలు ఉంటాయి. కానీ బద్ది పోచమ్మ ఆలయాలు ఉండడం అరుదు. ప్రస్తుతం వేములవాడలో, అనాజీపూర్‌లో మాత్రమే ఉన్నాయి. స్వాతంత్ర్యానికి పూర్వం వివిధ ప్రాంతాల నుంచి ఎడ్లబండ్లపై వేములవాడ ఆలయానికి అనాజీపూర్ మీదుగా వెళ్లేవారు ఈ గుడి సమీపంలోని చేదబావి వద్ద ఆగి అమ్మవారికి పూజలు చేసి వంట చేసుకుని తిని మళ్లీ బయలుదేరేవారని పెద్దలు చెబుతున్నారు. ఇటీవల ఆ బావి కనుమరుగుకాగా, గుడి కూడా శిథిలావస్థకు చేరింది. ఇదిలాఉండగా ఇటీవల కొందరు దుండగులు ఆలయంలోని అమ్మవారి విగ్రహాన్ని దొంగిలించగా పోలీసులు నిందితులను పట్టుకుని విగ్రహాన్ని స్వాధీనం చేసుకొని గ్రామస్తులకు అప్పగించారు. గుడి చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. అమ్మవారి ఆలయాన్ని పునర్‌నిర్మించి పూర్వ వైభవం తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు.

బంగారం కోసం మహిళ హత్య

● నిందిత దంపతులకు రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

మాసాయిపేట సెప్టెంబర్ 20: మాసాయిపేట మండలం సాజు తండాలో గిరిజన మహిళ హత్య కేసులో ఇద్దరు నిందితులను శుక్రవారం చేగుంట పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దీనికి సంబంధించిన వివరాలను శుక్రవారం తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి వెల్లడించారు. మాసాయిపేట మండలం సాజు గిరిజనతండాకు చెందిన గిరిజన మహిళ మలోతు లలిత(48) ఈ నెల 11న ఉపాధిహామీ డబ్బుల కోసం బ్యాంకుకు వెళ్లి తిరిగి రాలేదు. లలిత తల్లి దేవి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టగా లలితకు తూప్రాన్ కల్లు దుకాణంలో పరిచయమైన ఘణపూర్ గ్రామానికి చెందిన భార్యాభర్తలు వడ్డె కనకయ్య, వడ్డె ప్రమీల హత్య చేసినట్లు తెలిసింది. లలిత ఒంటిపై ఉన్న బంగారు, వెండి నగలను కాజేయాలనే ఉద్దేశంతో ముందస్తు పథకం ప్రకారం లలితను యాదగిరిగుట్టకు వెళ్దామని నమ్మించారు. ఈ మేరకు ఆమెను బైకుపై తీసుకువెళ్లి జగదేవ్‌పూర్ మండలం పీర్లపల్లి అటవీ ప్రాంతంలో గొంతు నులిమి హత్య చేసి మృతురాలి ఒంటిపై ఉన్న రూ.35 వేలు విలువ చేసే ఆభరణాలను తస్కరించారు. అనంతరం తూప్రాన్‌లోని పాన్ బ్రోకర్ వద్ద నగలు కుదువ పెట్టి డబ్బుతో జల్సాలు చేశారు. కాగా, నిందితులను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసును చాకచక్యంగా చేధించిన చేగుంట పోలీసులను డీఎస్పీ అభినందించారు. సమావేశంలో రామాయంపేట సీఐ వెంకటరాజగౌడ్, చేగుంట ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో సిద్దిపేట జిల్లాకు రెండు పతకాలు

సిద్దిపేట టౌన్, సెప్టెంబరు20: హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సిద్దిపేట జిల్లాకు రెండు పతకాలు వచ్చాయని అథ్లెటిక్స్ సంఘం సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రోళ్ల వెంకటస్వామిగౌడ్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాఘవపూర్‌కు చెందిన గ్యార లీలా ఆనంద్ డేకథ్లాన్‌లో వెండి పతకం, టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ కొండపాక చెందిన నగేష్ అండర్ 18 విభాగంలో జువెలిన్ త్రోలో కాంస్య పతకం సాధించారన్నారు. వీరిని అథ్లెటిక్స్ సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి పన్యాల రామేశ్వర్‌రెడ్డి, జిల్లా సైక్లింగ్ సంఘ అధ్యక్షుడు బండారుపల్లి శ్రీనివాసులు, టీజీపీఈటీఏ జిల్లా అధ్యక్షుడు ఏర్వ అశోక్ జిల్లా, రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కడకంచి ఉప్పలయ్య, సంఘ బాధ్యులు బయ్యారపు కనకరెడ్డి, ప్రభాకర్, కృష్ణ కుమార్, నిషంక్‌గౌడ్, సాగర్, స్వామి తదితరులు అభినందించారు.

డిపో సరే.. డ్రైవర్లు ఏరి?

- 45 ఉండాల్సిన చోట 35 మందే..
- పూర్తి స్థాయిలో నడవని బస్సులు



నర్సాపూర్ ఆర్టీసీ డిపో ఎదుట రహదారిపై ధర్నా చేస్తున్న సోలక్‌పల్లి వాసులు

నర్సాపూర్, సెప్టెంబరు 20: నర్సాపూర్‌లో ఆర్టీసీ డిపో ఏర్పాటు కావడంతో ఇక తమ ప్రయాణ కష్టాలు తీరుతాయని ఈ ప్రాంతవాసులు ఆశించారు. అయితే, ప్రయాణికుల అవసరాలకు తగినట్లు బస్సులు నడపడంలో అధికారులు విఫలమవుతున్నారు. కారణంగా డిపోను ఏర్పాటు చేసిన అధికారులు.. అందుకు సరిపడా డ్రైవర్లను కేటాయించకపోవడమే కారణమని తెలుస్తోంది. దీంతో గ్రామాలకు సరిగ్గా బస్సులు రాక విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రత్యేక రాష్ట్రంలో రెండో డిపో

తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2022లో జూన్ 8న నర్సాపూర్‌లో ఆర్టీసీ డిపోను ఏర్పాటు చేశారు. మూడు అద్దె బస్సులను కలుపుకొని 29 బస్సులతో డిపో ప్రారంభమైంది. డిపోలో ప్రస్తుతం 36 మంది డ్రైవర్లు, 46 మంది కండక్టరులు, 30 మంది మెకానిక్‌లు, ఇతర సిబ్బంది 5గురు ఉన్నారు. డిపో ఏర్పాటు అయ్యాక ఆయా రూట్లలో బస్సులు నడపడం వల్ల రీజియన్ పరిధిలోనే అత్యధిక ఆదాయం వచ్చే డిపోగా పేరు తెచ్చుకుంది. అయితే, రాను రాను ఈ డిపోపై సరైన ఉన్నతధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పాటు పూర్తిస్థాయి డిపో మేనేజర్ లేక నిర్వాహణ అంతంతగా మారిందన్న విమర్శలున్నాయి.

విధుల్లో 30 మంది డ్రైవర్లే..

నర్సాపూర్ డిపోలో ఉన్న బస్సులకు అనుగుణంగా మొత్తం 45 మంది డ్రైవర్లు అవసరం. కానీ, డిపో పరిధిలో 36 మంది డ్రైవర్లు ఉన్నారు. ఇందులో కనీసం ఆరుగురు వివిధ కారణాలతో సెలవు తీసుకోవడం సహజమే. దీంతో ఉన్న 30 మందితోనే బస్సులను ఆయా రూట్లలో నడపాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక్కో డ్రైవరు రోజు ఆరుగంటలు పనిచేయాల్సి ఉంటుంది. కానీ, డ్రైవర్లు తక్కువ మంది ఉండటంతో డిపో పరిధిలోని అన్ని రూట్లలో బస్సులు నడపలేకపోతున్నారు. జిన్నారం మండలం నుంచి బస్సులు నడవడం లేదంటూ ఇటీవల విద్యార్థిను డిపో వద్ద ధర్నాకు దిగారు. బస్సులు నడవకపోవడంతో తాము చదువులు కొనసాగించలేకపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నర్సాపూర్ డిపోకు డ్రైవర్లను కేటాయించాలని, పూర్తిస్థాయి డీఎంను నియమించాలని కోరుతున్నారు.

బస్సుల కోసం గ్రామస్తులు, విద్యార్థుల ధర్నా..

జిన్నారం/నర్సాపూర్, సెప్టెంబరు 20: బస్సు సర్వీసుల నిలిపివేతకు నిరసనగా సోలక్‌పల్లి వాసులు, తమ గ్రామాల మీదుగా బస్సులు నడపాలని డిమాండ్ చేస్తూ నాగారం, శేర్‌ఖాన్‌పల్లి, రొయ్యపల్లి తదితర గ్రామాల విద్యార్థులు శుక్రవారం ధర్నా చేశారు. నర్సాపూర్ బస్ డిపో ఎదుట ప్రధాన రహదారిపై నిర్వహించిన ధర్నాకు మద్దతుగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్ యాదవ్, అసెంబ్లీ కన్వీనర్ రమణారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేందర్, ఓబీసీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నరమేష్‌గౌడ్, మండల బీజేపీ అధ్యక్షుడు జగన్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి భరత్ తదితరులు ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గత నెల 14 నుంచి నర్సాపూర్ నుంచి సోలక్‌పల్లి, శివానగర్ మీదుగా నడిచే ఆర్టీసీ బస్సులను పూర్తిగా రద్దు చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని అధికారులను కలిసి వినతిపత్రం అందజేసినా స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే తమ గ్రామాలకు బస్సులు నడపాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్‌యాదవ్, నాయకుడు రమేష్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ రాజు, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామికి ఎస్పీ అభినందనలు



వేణుగోపాలస్వామిని అభినందిస్తున్న జిల్లా ఎస్పీ రూపేష్

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 20 : తెలంగాణ రాష్ట్ర అవిశ్రాంత పోలీసు అధికారుల సంఘం ఉపాధ్యక్షుడిగా టి.వేణుగోపాలస్వామి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ రూపేష్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలువగా ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎల్లయ్య, ఉపాధ్యక్షుడు అఫ్జల్, జాయింట్ సెక్రటరీ ప్రభాకర్‌రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, జీవన్, జహంగీర్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ.. ఆరుగురికి గాయాలు





ఘటనా స్థలంలో పడిపోయిన వృద్ధ జంట, బాలుడు

జోగిపేట, సెప్టెంబరు 20 : రెండు బైకు ఢీకొన్న ఘటన మండలంలోని డాకూరు గ్రామ శివారులోని జాతీయ రహదారిపై చోటు చేసుకున్నది. ఎస్ఐ పాండు కథనం ప్రకారం అల్లాదుర్గం మండలం గడి పెద్దాపూర్ గ్రామానికి చెందిన ఓ వృద్ధ జంట టీవీఎస్ మోపెడ్‌పై వస్తుండగా, నారాయణఖేడ్ నుంచి ఇద్దరు చిన్నారులతో సహ ఓయువ జంట మోటార్ సైకిల్‌పై సంగారెడ్డి వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో వారిద్దరి బైక్‌లూ ఢీకొట్టాయి, ఈ ప్రమాదంలో బాలుడు, బాలికతో సహా రెండు బైకులపై ఉన్న రెండు జంటలకూ తీవ్ర గాయాలయ్యాయి. వారిని వెంటనే జోగిపేటలోని ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించి, మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డి ఆసుపత్రికి తరలించారు ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

మహిళ మెడలోని బంగారు పుస్తెలతాడు చోరీ

నర్సాపూర్, సెప్టెంబరు 20: నర్సాపూర్ పట్టణంలో శుక్రవారం నిర్వహించిన సంతకు వచ్చిన ఓ మహిళ కళ్లలో కారం చల్లి మెడలో నుండి మూడున్నర తులాల బంగారు పుస్తెల తాగు అపహరించిన ఘటన సాయంత్రం చోటు చేసుకుంది. బాధితురాలి కథనం ప్రకారం మండలంలోని మంతూరు గ్రామానికి చెందిన లక్ష్మీ అనే మహిళ తన మనుమరాలుతో కలిసి కూరగాయలకు వచ్చి కూరగాయలు కొనుగోలు చేసింది. అదే సంతలో తెలిసిన ఓ మహిళ కలవడంతో ఇద్దరు కలిసి సాయంత్రం కల్లు తాగుదామని నర్సాపూర్ బస్టాండు సమీపంలో ఉన్న కల్లుదుకాణంకు వెళ్లి కల్లు తాగారు. అనంతరం తిరిగి వెళ్లే క్రమంలో ఓ గుర్తు తెలియని మహిళ లక్ష్మీని అనుసరించి కండ్లలో ఒక్కసారిగా కారం చల్లి మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారు పుస్తెల తాడు అపహరించుకుపోయింది. వెంటనే తేరుకుని అరిచి చుట్టుప్రక్కల గాలించిన ఫలితం లేకపోవడంతో స్థానిక పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్ఐ లింగం కేసు నమోదు చేసుకుని దర్యప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ప్రకృతి వనం.. వికృత రూపం..

● నిర్వహణ లోపంతో నెరవేరని లక్ష్యం



బృహత్ ప్రకృతి వనంలో నాటకుండా వదిలేసిన మొక్కలు

శివ్వంపేట, సెప్టెంబరు 20 : మండల ప్రజలకు ఆహ్లాదాన్ని అందించడమే లక్ష్యంగా గత ప్రభుత్వం బృహత్ పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. కానీ నిర్వహణ సరిగా లేక వాటి పరిస్థితి అధ్వానంగా మారింది. మండల పరిధిలోని గోమారంలో ఏర్పాటు చేసిన బృహత్ పల్లె ప్రకృతి వనం నిర్వహణ గాలికి వదిలేయడంతో పిచ్చి మొక్కలతో కళాహీనంగా మారింది. రూ.3,16,966 ఉపాధి హామీ నిధులను వెచ్చించి ఏర్పాటు చేశారు. నాటడానికి తెచ్చిన మొక్కలను అలానే వదిలేశారు. ప్రకృతి వనం ప్రధాన ద్వారం ఎదుట పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో లోపలికి అడుగు పెట్టలేని పరస్థితి నెలకొంది. వనంలోని మొక్కలకు నీళ్ల పట్టకపోవడంతో ఎండిపోతున్నాయి. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి బృహత్ పల్లె ప్రకృతి వనాన్ని బాగుపరచాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై స్థానిక ఎంపీడీవో నాగేశ్వర్‌ను సంప్రదించగా తమకు గోమారం గ్రామంలో గృహతి పల్లె ప్రకృతి వనం ఉన్నట్లుగా తెలియదని ప్రకృతి నిర్వహణకు చర్యలు చేపడతామని తెలిపారు.





ప్రకృతి వనం ఎదుటపిచ్చిమొక్కలు, లోపల ఎండుతున్న మొక్కలు

సమగ్ర ఓటరు జాబితాకు కృషిచేయాలి

● రాష్ట్ర ఎన్నికల పరిశీలకుల బృందం సభ్యులు



తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు

జహీరాబాద్, సెప్టెంబరు 20: సమగ్ర ఓటరు జాబితా తయారీకి బీఎల్‌వోలు కృషి చేయాలని రాష్ట్ర ఎన్నికల పరిశీలకుల బృందం సభ్యులు నీలిమ, శ్రీకాంత్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం జహీరాబాద్‌లోని తహసీల్ కార్యాలయంలో బీఎల్‌వోలతో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఓటరు జాబితాలో తప్పులు లేకుండా రూపొందించేందుకు కృషి చేయాలన్నారు. నమోదుసమయాల్లో ఏమైన సందేహాలుంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుపోయి వాటిని నివృత్తి చేసుకోవాలని, అలాగే కొత్త ఓటర్ల నమోదును కూడా చేపట్టాలన్నారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని రంజోల్‌లో పలు పోలింగ్ బూత్‌లను వారు పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ రవీందర్, ఆర్‌ఐ రుక్మొద్దీన్, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

● నారాయణఖేడ్: నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకొని శుక్రవారం రాష్ట్ర ప్రత్యేక పరిశీలకులు శ్రీకాంత్‌రావు, నీలిమ ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోల ద్వారా చేపట్టిన ఇంటింటి సర్వేను పరిశీలించడమే కాకుండా ఓటర్ నమోదు, మార్పులు, చేర్పులు తొలగింపు ప్రక్రియ గురించి తీసుకుంటున్న చర్యల గురించి వారు పరిశీలించారు. ఖేడ్‌లో 167వపోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఖేడ్ పట్టణంలోని ఓటర్ల ఇంటికి వెళ్లి జాబితాలో ఉన్న పేర్లను, వివరాలను పరిశీలించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో బీఎల్‌వోలతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాస్కర్, డిప్యూటీ తహసీల్దార్ రాజ్‌పటేల్, ఆర్ఐ.మాధవరెడ్డి, సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

● పలు మండలాల్లో గ్రామైక్య మహిళా సంఘాల మహాసభ సమావేశాలు



వెల్దుర్తి: సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మోహన్



పెద్దశంకరంపేట: సమావేశంలో మాట్లాడుతున్న అల్లాదుర్గం సీఐ రేణుకరెడ్డి

వెల్దుర్తి, సెప్టెంబరు 20: మహిళలు అన్ని రంగాల్లో ఆర్థికంగా ఎదగాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు పేర్కొన్నారు. వెల్దుర్తిలోని ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం 16వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మెదక్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మోహన్ హాజరై మాట్లాడారు. గ్రామ సంఘాల సభ్యులు ఆర్థిక ప్రగతిలో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరం 130 శాతం బ్యాంకు లింకేజీ, బ్యాంకు లింకేజీ ఎన్‌పీఏ 0.5శాతం ఉండాలని సూచించారు. ప్రతి మహిళ కనీసం రూ. 10వేల నుంచి రూ. 30వేల వరకు ఆదాయం వచ్చేలా సుస్థిర జీవనోపాధి కల్పించాలనే లక్ష్యాలను నిర్దేశించారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి మూడేళ్ల వరకు కాపాడాలని సూచించారు. ఆదాయ, వ్యయాలు, మహిళా శక్తి ప్రోగ్రాం, డైరీ , బ్యాక్ యార్డు పౌల్ట్రీ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్ వంటి అంశాలపై చర్చించారు. సమావేశంలో మండల సమైక్య అధ్యక్షురాలు నవనీత, ఏపీఎం శంకరయ్య, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

● తూప్రాన్: మండల మహిళా సమైక్య 20వ మహాసభ సమావేశం మండల సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రతీ గ్రామ సంఘం కార్యవర్గం, గ్రామ సంఘం వీవో, మండల సమైక్య సిబ్బంది, కార్యవర్గం, ఏపీఎం హాజరయ్యారు. సమావేశంలోమండల సమైక్య లావాదేవీలు, ఆర్థిక సంవత్సరం ప్రణాళిక , పోషణ అభియాన్, 'నా మొక్క నాబాధ్యత' తదితర అంశాలపై చర్చించారు.

● చేగుంట: మహిళలు ఆర్థికంగా సామాజికంగా ముందజలో ఉండాలని చేగుంట ఎంపీడీవో చిన్నారెడ్డి పేర్కొన్నారు. చేగుంట ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సునిత అధ్యక్షతన 16 వ వార్షిక సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో చిన్నారెడ్డి మాట్లాడుతూ మండలంలోని 912 మహిళా సంఘాలు ఉండగా 35 గ్రామసంఘాలు ప్రతి నెలా సమావేశాలు నిర్వహించి బ్యాంక్ శ్రీనిధి ద్వారా పొందిన రుణాలతో అభివృద్ధి చెంది ఇతర సంఘాలకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. గ్రామ సంఘాల్లో రికవరీలో చూపిన ప్రతిభను గుర్తించి బహుమతులు అంజేశారు.

● పెద్దశంకరంపేట: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితేనే సామాజిక అభివృద్ధి జరుగుతుందని అల్లాదుర్గం సీఐ రేణుకరెడ్డి పేర్కొన్నారు. పెద్దశంకరంపేటలోని మండల మహిళా సమైక్య 16వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో సీఐ పాల్గొని మాట్లాడారు. సమావేశంలో తహసీల్దార్ గ్రేస్‌బాయ్, ఎస్ఐ శంకర్, ఐకేపీఏపీఎం గోపాల్, ఎస్‌బీఐ మేనేజర్ వంశీక్రిష్ణ, మండలసమాఖ్య అధ్యక్షురాలు ఫౌజియా, సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే స్థాయికి ఎదగాలి: మెడ్వాన్ డైరెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్ రెడ్డి

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 20: గృహకార్మికులు తోటి కార్మికుల సమస్యలు పరిష్కరించే స్థాయికి ఎదగాలని మెడ్వాన్ సంస్థ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. సంగారెడ్డిలోని మెడ్వాన్ సంస్థ కార్యాలయంలో శుక్రవారం గృహకార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గృహకార్మికుల్లో నాయకత్వ లక్షణాలు, కార్మికుల హక్కులపై పోరాడే ఓపిక అలవర్చుకోవాలని, గ్రూపుల్లో ఉన్న సభ్యుల సమస్యలను తమ సమస్యలుగా భావించి స్పందించాలని సూచించారు. గృహకార్మికుల హక్కులను కాపాడేందుకు అందరూ ఏకమైతేనే సమస్యలు పరిస్కారమవుతాయన్నారు. సమావేశంలో మెడ్వాన్ సంస్థ కో ఆర్డినేటర్ స్వప్న, సిబ్బంది ముస్తఫా, అనసూయ, గృహకార్మికులు పాల్గొన్నారు.



ప్రత్యేక ప్రార్థనల్లో ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్, మాజీ మంత్రి డా.చంద్రశేఖర్ తదితరులు



ప్రత్యేకప్రార్థనల్లో సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, నాయకుడు సిద్దం ఉజ్వల్‌రెడ్డి తదితరులు

శేఖాపూర్ దర్గాలో ప్రముఖుల ప్రత్యేక ప్రార్థనలు



దర్గాలో ఎమ్మెల్యే మాణిక్‌రావు ప్రత్యేక ప్రార్థనలు

జహీరాబాద్, సెప్టెంబరు 20: మండలంలోని శేఖాపూర్‌లో షేక్‌శహబుద్దీన్‌తుర్కి రహముతుల్లా ఉత్సవాలు గత రెండు రోజులుగా భక్తిశ్రద్ధలతో ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. రెండో రోజైన శుక్రవారం దర్గాలో నిర్వహించిన ప్రత్యేకప్రార్థనల్లో ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్, ఎమ్మెల్యే మాణిక్‌రావు, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, మాజీమంత్రి. డా.చంద్రశేఖర్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా. సిద్దం ఉజ్వల్‌రెడ్డి, నాయకులు ఖిజార్‌యాఫై, గ్రామస్థులు, ప్రముఖులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యేల భరోసా



సుతార్పల్లిలో బాధిత కుటుంబాన్ని ఓదారుస్తున్న పద్మారెడ్డి

రామాయంపేట, సెప్టెంబరు 20: గత వారం రోజుల్లో ఇరువురు వ్యక్తులు మరణించగా రామాయంపేటలో మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హనుమంతరావు, పద్మారెడ్డి మృతుల కుటుంబాలకు అండగా నిలిచారు. మూడు రోజుల క్రితం పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు చాకలి వెంకటి అనారోగ్యంతో చనిపోగా ఆ కుటుంబాన్ని శుక్రవారం మైనంపల్లి హనుమంతరావు ఓదార్చారు. మృతుడి కూతురు పెళ్లికి తన సొంత ఖర్చులతో భోజనం పెట్టిస్తానని భరోసా ఇచ్చారు. అలాగే సుతార్పల్లిలో భూ వివాదంతో ఆత్మహత్య చేసుకున్న బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు పున్నస్వామి ఇంటికి మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి వెళ్లి కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు.

సంగారెడ్డిలో పాస్‌పోర్టు కేంద్రాన్ని ఏర్పాటు చేయండి



ఎంపీకి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 20: సంగారెడ్డిలో పాస్‌పోర్టు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావును శుక్రవారం హైదరాబాద్‌లో అంబేడ్కర్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొండాపురం జగన్, అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పంబల్ల దుర్గాప్రసాద్‌తో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సానుకూలంగా స్పందించిన ఎంపీ పాస్‌పోర్టు కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో సురేష్, యాదగిరి, రాజు తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్‌లో ఐదుగురికి రిమాండ్

జహీరాబాద్, సెప్టెంబరు 20: మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరించిన ఐదుగురు వ్యక్తులను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్టు జహీరాబాద్ పోలీసులు శుక్రవారం తెలిపారు. ఈ నెల 19న జహీరాబాద్ పట్టణంలో మిలాదున్ నబీ పండుగ సందర్భంగా కొందరు ఆకతాయిలు మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరించారన్నారు. ఈమేరకు వారందరిని శుక్రవారం అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.

సదాశివపేటలో అస్సాంవాసి అదృశ్యం



బిష్ణురీ

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 20: బతుకుదెరువు కోసం సదాశివపేటకు వచ్చిన అస్సాం వాసి అదృశ్యమయ్యాడు. పట్టణ సీఐ ఎస్ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. అస్సాం రాష్ట్రం ఆయిలకంద జిల్లా అయినఖల్ గ్రామానికి చెందిన బిష్ణురీ అనే వ్యక్తి బతుకుదెరువు కోసం అదే రాష్ట్రానికి చెందిన సమీర్ చౌహాన్ అనే వ్యక్తి వెంట సదాశివపేటకు ఈ నెల 9న వచ్చాడు. వారిద్దరు కలిసి సదాశివపేటలోని సంజిత్‌రీ అనే వ్యక్తి వద్ద ఉండేవారు. అయితే మానసిక స్థితి సరిగ్గా లేని బిష్ణురీ ఈ నెల 10న కత్తితో తన పురుషాంగాన్ని కోసుకున్నాడు. సంజిత్‌రీ అతన్ని వెంటనే సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించాడు. చికిత్స అనంతరం ఈ నెల 11న రూ.4వేల నగదు ఇచ్చి సమీర్ చౌహాన్ అనే వ్యక్తి వెంట అతని సొంత గ్రామానికి తీసుకెళ్లాలని పంపించాడు. అయితే సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కే సమయంలో బిష్ణురీ తప్పిపోయాడు. ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో సంగారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సమీర్ చౌహాన్ ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ భాస్కర్ తెలిపారు. ఎవరైనా ఆచూకీ తెలిస్తే 08455 276333 లేదా 8712656718 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

ఎంపీ, ఎమ్మెల్యేలకు సన్మానం



ఎంపీ, ఎమ్మెల్యేలను సన్మానిస్తున్న జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యుడు ప్రకాష్‌రాథోడ్

నారాయణఖేడ్, సెప్టెంబరు 20: జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ రెడ్డిలను జిల్లా అభివృద్ధి కోఆర్డినేషన్, మానిటరింగ్ కమిటీ సభ్యులుగా నియమితులైన ప్రకాష్‌రాథోడ్ నారాయణఖేడ్‌లో ఘనం గా కృతజ్ఞతలు తెలుపుతూ సన్మానించారు. తనకు పదవి నిచ్చినందుకు పదవికి న్యాయం చేస్తానని తెలిపారు.

23,123 ధరణి దరఖాస్తుల పరిష్కారం: ఆర్డీవో

తూప్రాన్, సెప్టెంబరు 20: ప్రభుత్వ ఆదేశాల మేరకు ధరణి స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా తూప్రాన్ డివిజన్ పరిధిలో 23,216 దరఖాస్తులను పరిష్కరించినట్లు ఆర్డీవో జయచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 12,912 ధరణి దరఖాస్తులను ఆమోదించి వారి పట్టాదారు పాసు పుస్తకాలలో నమోదు చేసినట్లు తెలిపారు. 7,314 దరఖాస్తులకు సంబంధించి సరైన పత్రాలు లేకపోవడంతో తిరస్కరించినట్టు తెలిపారు. మరో వారం రోజుల్లో పెండింగ్ దరఖాస్తులు పరిష్కారం అవుతాయన్నారు. భూసమస్యల పరిష్కారం కోసం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో సంప్రదించాలని సూచించారు.

మహిళాశక్తి క్యాంటిన్‌ను ప్రారంభించిన సునితారెడ్డి

హత్నూర, సెప్టెంబరు 20: మహిళలు అన్ని రంగాలలో రాణిస్తూ ఆర్థిక అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని నస్తీపూర్ స్థానిక గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా శక్తి క్యాంటీన్‌ను శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వావిలాల నర్సింలు, జిల్లా అదనపు డీఆర్డీవో జంగారెడ్డి, డీపీఎం జయశ్రీ, ఎంపీడీవో శంకర్, ఏపీఎం దేవేందర్, సీసీలు, వీవోఏ ప్రవీణ్, మహిళలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్-ఉన్-నబీ



వేడుకలు జరుపుకుంటున్న ముస్లింలు

నారాయణఖేడ్, సెప్టెంబరు 20: ఖేడ్ పట్టణంలో శుక్రవారం మిలాద్-ఉన్-నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆర్టీసీ రిటైర్డు డ్రైవర్ బాబర్ మియా జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో ముస్లిం పెద్దలు, దర్గా కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

●పెద్దశంకరంపేట: మండలకేంద్రంలో ముస్లిం లు శుక్రవారం మిలాద్-ఉన్-నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పురవీధుల గుండా ముస్లిం యువకులు, చిన్నారులు, పెద్దలు, ర్యాలీ నిర్వహించారు.

మున్నూరు కాపు సిద్దిపేట జిల్లా కన్వీనర్‌గా దేమె

రామాయంపేట, సెప్టెంబరు 20: సిద్దిపేట మున్నూరు కాపు జిల్లా కన్వీనర్‌గా రామాయంపేటకు చెందిన కౌన్సిలర్ దేమె యాదగిరి నియామకమయ్యారు. ఈ మేరకు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర చేతుల మీదుగా శుక్రవారం హైదరాబాదులో నియామక పత్రాన్ని అందుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పటాన్‌చెరు, సెప్టెంబరు 20: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో పలు కాలనీలలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ వెంకట్‌రాంరెడ్డి పేర్కొన్నారు. ఉదయం 10గంటలకు సురక్షహాబిటేట్, ఎన్టీఆర్ కాలనీ, అమీన్‌పూర్ చుట్టుపక్కల ప్రాంతాలలో, మధ్యాహ్నం ఒంటిగంటకు వెదిరి ఫీడర్ పరిధిలో స్వల్ప సమయం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల వరకు బంధంకొమ్ము ఫీడర్ పరిధిలో మరమ్మతులు, కొత్త కనెక్షన్‌లు ప్రారంభించే క్రమంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

గుండెపోటుతో మాజీ సర్పంచు మృతి



రాజు (ఫైల్)

నాగల్ గిద్ద, సెప్టెంబరు 20: మండల పరిధిలోని ఎర్రబొగుడ తాజా మాజీ సర్పంచు మచ్చూరి రాజు (45) శుక్రవారం మృతి చెందాడు. కుటుంబీకులు గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం ఉదయం ఛాతిలో నొప్పి ఉందని, తెలుపడంతో కుటుంబీకులు నారాయణఖేడ్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలోనే చనిపోయాడని కుటుంబీకులు తెలిపారు. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. మాజీ సర్పంచు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం: మెదక్ ఎమ్మెల్యే



నిజాంపేట: లబ్ధిదారుకు కల్యాణలక్ష్మి చెక్కును అందజేస్తున్న మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు

మెదక్ అర్బన్/నిజాంపేట/హవేళిఘణపూర్, సెప్టెంబరు 20: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం మెదక్‌లోని ఓ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలంలోని 116 మంది లబ్ధిదారులకు కల్యాణి లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా రోహిత్‌రావు మాట్లాడుతూ..పేదింటి ప్రజలకు కల్యాణి లక్ష్మి పథకం వరం లాంటిదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తామని తెలిపారు. మెదక్‌లో జరిగిన కార్యక్రమంలో కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, కౌన్సిలర్లు లింగం, శేఖర్, లక్ష్మీనారాయణగౌడ్, సమిఉద్దిన్, నాయకులు బొజ్జ పవన్, మధుసూదన్‌రావు, కృష్ణ, శివరామకృష్ణ, వెంకటనారాయణ, శంకర్, హఫీజొద్దిన్, నాగిరెడ్డి, తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నిజాంపేట మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రోహిత్‌రావు వివిధ గ్రామాలకు చెందిన 78 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్ కుమార్, ఎంపీడీవో రాజిరెడ్డి, ఆర్ఐ గంగాధర్, మాజీ సర్పంచులు ముత్యం రెడ్డి, అమర్ సేనారెడ్డి, పంజా మహేందర్, లింగం గౌడ్, నసీరుద్దీన్, వెంకట్ గౌడ్ తదితరులు ఉన్నారు. హవేళిఘణపూర్ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో 71 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సింధురేణుక, డిప్యూటీ తహసీల్దార్ నవీన్‌కుమార్, పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సుభాష్, శ్రీకాంత్, రాంచందర్‌రావు, అక్బర్, మహేందర్ రెడ్డి, ముల్సాబ్, బాలకిషన్ రావు, రాములు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎస్జీఎఫ్ క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ



సంగారెడ్డి అర్బన్: క్రీడల్లో జిల్లాస్థాయికి ఎంపికైన జ్యోతిబాపూలే విద్యార్థులు

సంగారెడ్డి అర్బన్/నారాయణఖేడ్, సెప్టెంబరు 20: సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండో రోజు మండలస్థాయి క్రీడలు ఉత్సాహంగా కొనసాగాయి. మూడు రోజుల పాటు జరిగే క్రీడల్లో భాగంగా శుక్రవారం అండర్-14, 17 కబడ్డీ, ఖోఖో పోటీలు జరిగాయి. శనివారం క్రీడలు ముగియనున్నాయి. మండలంలో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల నుంచి సుమారు 400 మంది విద్యార్థులు ఈ క్రీడా ఎంపికల్లో పాల్గొన్నారు. కాగా ఈ క్రీడల్లో సంగారెడ్డిలోని మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలకు చెందిన విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. అండర్-14, 17 ఖో-ఖో విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచారు. అండర్ 14 ఖో-ఖో విభాగంలో డేవిడ్, చరణ్, గణపతి, అరుణ్ కుమార్, అండర్-17 విభాగంలో విభాగంలో సాయిచరణ్, సిద్ధార్థ, నర్సింలు, హర్షవర్ధన్‌రెడ్డిలు ఎంపికయ్యారు. అదే విధంగా కబడ్డీ అండర్-14 విభాగంలో సుందర్‌సింగ్, అండర్-17 విభాగంలో నర్సింలు, సాయికుమార్ జిల్లా స్థాయికి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ధన్‌రాజ్ తెలిపారు. నారాయణఖేడ్‌లోని పెద్దశంకరంపేటకు సంబంధించిన మహాత్మాజ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకులం విద్యార్థులు సంగారెడ్డిలో జరిగిన ఎస్జీఎఫ్ క్రీడల్లో చక్కటి ప్రతిభ కనబరించేందుకు సహకరించిన పీఈటీ రామారావును శుక్రవారం ఘనంగా సన్మానించారు. సన్మాన కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెల్దుర్తిలో ముగిసిన మండలస్థాయి క్రీడలు

వెల్దుర్తి, సెప్టెంబరు 20: మండల కేంద్రమైన వెల్దుర్తిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఎస్జీఎఫ్ క్రీడలు శుక్రవారం ముగిశాయి. వెల్దుర్తి, కుకునూర్, మంగళపర్తి, మనేపల్లి, బండపోసన్‌పల్లి ఉన్నత పాఠశాలల నుంచి బాలికలు మండలస్థాయి వాలీబాల్, ఖోఖో, కబడ్డీ క్రీడల్లో పాల్గొన్నారు. ఆయా క్రీడల్లో గెలుపొందిన విద్యార్థినిలకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో వెల్దుర్తి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

శివ్వంపేట, సెప్టెంబరు 20: పోషకాహారంతోనే బాలికలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోష పేర్కొన్నారు. పోషణ మాసోత్సవంలో భాగంగా శుక్రవారం మండలంలోని గూడూరు కేజీబీవీ విద్యార్థినులకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. బాలికల్లో రక్తహీనతను నివారించేందుకు ఆహారంలో ఆకుకూరలు పాలు, గుడ్లను తీసుకోవాలని తెలిపారు. అనంతరం విద్యార్థినులు, ఉపాధ్యాయులతో పోషకాహార ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపల్ మంజుల, విద్యార్థినులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

● చిన్నశంకరంపేట: పిల్లల ఎదుగుదలకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ అన్నారు. పోషణ మాసోత్సవంలో భాగంగా శుక్రవారం మండలంలోని దర్పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలింతలు, గర్భిణులకు ఆరోగ్యం పట్ల పలు సూచనలు కల్పించారు. బాలింతలకు సామూహిక సీమంతాలు చేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● పలు మండలాల్లో స్వచ్ఛ కార్యక్రమాలు



నిజాంపేట: స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయిస్తున్న జడ్పీ సీఈవో

పుల్‌కల్, సెప్టెంబరు 20:చౌటకూర్ మండల కేంద్రంలో శుక్రవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మండల ప్రత్యేకాధికారి బాలరాజ్ హాజరయ్యారు. డ్వాక్రా సంఘాల మహిళలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పారిశుధ్య సిబ్బంది గ్రామంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రత్యేకాధికారి మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తను వేర్వేరుగా బుట్టల్లో వేయాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీఈవో శ్రీకాంత్‌గౌడ్, ఇంటెలిజెంట్ ఆఫీసర్ నాగేశ్వర్‌రావు, ప్లాంటేషన్ మేనేజర్ మణికుమార్, నాయకులు పాల్గొన్నారు.

●నారాయణఖేడ్: ఖేడ్‌మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థులు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులు ర్యాలీగా స్థానిక ఆక్సిజన్ పార్కుకు వెళ్లి అక్కడ చెత్తను తొలగించి స్వచ్ఛత పనులు నిర్వహించారు.

● కల్హేర్: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిర్గాపూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రతిభ సూచించారు. సిర్గాపూర్ మండల పరిధిలోని ఖాజాపూర్ గ్రామంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించి, మందులను పంపిణీ చేశారు. ప్రజలు నివాస పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఉన్నారు.

● కంగ్టి: మండల పరిధిలోని గాజుల్‌పాడ్‌లో ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో భాగంగా వీధులను శుభ్రం చేసి, మొక్కలను నాటారు. మండల ప్రత్యేకాధికారిగా నూతన్‌కుమార్, ఎంపీడీవో సత్తయ్య మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడానికి ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సూచించారు. వెంట ఎంపీవో సుభాష్, కార్యదర్శి రవికుమార్, దీపక్, భీంరావు, మాధవ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

● నిజాంపేట: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని మెదక్ జడ్పీ సీఈవో ఎల్లయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం డ్రైడే ఫ్రైడే సందర్భంగా స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అంతకు ముందు చల్మెడ గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించి పరిసరాలను పరిశీలించారు.

● నర్సాపూర్: మండలంలోని పెద్దచింతకుంట ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదర్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకే ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు.

● అల్లాదుర్గం: పరిసరాల పరిశుభ్రంగా ఉంటే అందరూ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీవో చంద్రశేఖర్ పేర్కొన్నారు. డ్రైడే- ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని గడిపెద్దాపూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి రాములు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సభ్యత్వనమోదును ముమ్మరంగా చేపట్టాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి

న్యాల్‌కల్, సెప్టెంబరు 20: బీజేపీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సభ్యత్వనమోదు ప్రక్రియను ముమ్మరంగా చేపట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో చేపట్టిన సభ్యత్వ నమోదులో ఆమె పాల్గొని మాట్లాడుతూ ప్రతీ బూత్‌లో కనీసం 200మంది బీజేపీ సభ్యత్వం తీసుకునేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమపథకాల గురించి ప్రజలకు వివరించాలని ఆమె చెప్పారు. అనంతరం స్వచ్ఛభారత్‌లో భాగంగ న్యాల్‌కల్‌లో జడ్పీ ఉన్నత పాఠశాలలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నౌబాద్‌జగన్, శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని నిర్మాణాలను అడ్డుకున్న అధికారులు

కంది, సెప్టెంబరు 20: కందిలోని లక్ష్మీనగర్ కాలనీలో శుక్రవారం గ్రామ పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ఓ అక్రమ నిర్మాణాన్ని ఎంపీవో మహేందర్‌రెడ్డి, కార్యదర్శి విద్యాధర్ అడ్డుకున్నారు. అక్రమంగా వేసిన బేస్మెంట్‌ను పంచాయతీ సిబ్బంది తొలగించారు. కార్యక్రమంలో కార్యదర్శి విద్యాధర్, బిల్ కలెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మాణయ్య సార్ సేవలు మరువలేనివి

● పీసీసీ రాష్ట్ర కార్యదర్శి రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్

హత్నూర, సెప్టెంబరు 20: టీఎస్‌టీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి స్వర్గీయ మాణయ్య సార్ సేవలు మరువలేనివని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ కొనియాడారు. మాణయ్య వర్ధంతి సందర్భంగా మండల పరిధిలోని లింగాపూర్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్థానిక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లింగాపూర్ మాజీ సర్పంచ్ చార్ల లక్ష్మీమాణయ్య, మహిళా కాంగ్రెస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు దానంపల్లి సుజాత సత్యం, ఎన్ఎస్‌యూఐ మెదక్ జిల్లా అధ్యక్షుడు చార్ల మణిదీప్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదలచేయాలి

● తపస్ జిల్లా అధ్యక్షుడు దత్తాత్రి

జహీరాబాద్, సెప్టెంబరు 20: పెండింగ్ డీఏలను విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) జిల్లా అధ్యక్షుడు దత్తాత్రి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తూర్(బి), బూడ్దిపాడ్, బూచనెల్లి, అల్లీపూర్, ఆర్యనగర్, పాండురంగవీధి తదితర ప్రాంతాల్లో గల ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన సభ్యత్వ నమోదులో పాల్గొన్నారు. డీఎస్సీ నియామకాలు ఆలస్యమవుతున్న నేపథ్యంలో ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యావలంటీర్లను నియమించాలన్నారు. ప్రభుత్వం వెంటనే పీఆర్సీ అమలుచేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింహారెడ్డి, తుకారాం, శ్రీపాల్, రమేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అజోల్లా పెంపకంతో రైతులకు ప్రయోజనం

ఝరాసంగం, సెప్టెంబరు 20: అజోల్లా మొక్కల పెంపకంతో రైతులకు ప్రయోజనం చేకూరుతుందని కేవీకే శాస్త్రవేత్తలు రమేష్, కైలాష్, పలువురు విద్యార్థులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పొట్టిపల్లి గ్రామంలో డీడీఎస్- కేవీకే ఆధ్వర్యంలో అజోల్లా మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇది ఒక నాచురకం మొక్క అని చెప్పారు. దీంట్లో ప్రోటీన్‌శాతం అధికంగానే ఉంటుందన్నారు. ఈ మొక్క పశువులకు, కోళ్లకు మంచి దాణాగా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో విజయవాడ లయోలా కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

200 మందికి విశ్వకర్మ యోజన శిక్షణ ధ్రువపత్రాలు

నారాయణఖేడ్, సెప్టెంబరు 20: ఖేడ్‌లో గత 30 రోజులుగా నిర్వహించిన పీఎం విశ్వకర్మ యోజన శిక్షణ కార్యక్రమం ముగిసింది. ఖేడ్ ప్రాంతానికి చెందిన దాదాపు 200 మంది శిక్షణ పొందారు. శుక్రవారం శిక్షణ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శిక్షణ పొందినవారికి అఖిల భారత సాధుసంతుల రాష్ట్రప్రతినిధి, కొండాపూర్ హనుమాన్‌ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహారాజ్ ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పత్రి రామక్రిష్ణ, ఖేడ్ నియోజకవర్గ కన్వీనర్ రజనీకాంత్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాయిరాం, శిక్షకులు సూర్యవంశీ, శ్రావణ్‌కుమార్, సాయి చంద్రశేఖర్, సంతోష్ పాల్గొన్నారు.